

# పుచ్చకాయ తపస్సు

డా॥ ఎం.హరికిషన్

ఒక వూరి పక్కనే ఒక నది పారుతా వుండేది. ఒకసారి ఎండా కాలంలో ఆ నది చానా వరకు ఎండిపోయి ఇసుక కనబడతా వుంది. ఆ ఇసుకలో ఒక రైతు ఒక పుచ్చకాయల తోట వేసినాడు. పుచ్చకాయలంటే తెలుసు గదా... కలింగడి పళ్ళనే పుచ్చ కాయలని కూడా అంటారు. ఆ తోటలో ఒక తీగకి అప్పుడే ఒక చిన్న బుజ్జి పుచ్చకాయ పుట్టింది. అది నెమ్మదిగా కళ్ళు విప్పి చుట్టూ చూసింది. నది మీంచి వచ్చే చల్లని గాలికి సంబరంగా తల అటూయిటూ వూపుతా, ఆ తియ్యని నీళ్ళు తాగుతా నెమ్మదిగా పెరగసాగింది.

రోజూ సాయంకాలం అక్కడికి ఆ తోట యజమాని వచ్చేటోడు. ఏవేవో ఎరువులు తెచ్చి వేసేటోడు. నీళ్ళు పెట్టేటోడు. కలుపు మొక్కలుంటే పీకేసేటోడు. పశువులు ఏవీ లోపలికి వచ్చి తినిపోకుండా తోటచుట్టూ కంచె నాటించినాడు. అదంతా చూసిన ఆ పుచ్చకాయ "అబ్బ! ఈ రైతు ఎంత మంచోడు. నన్ను అపురూపంగా చూసుకుంటూ వున్నాడు" అనుకోనింది. అలా రెండు నెలలు గడిచే సరికి ఆ కాయ పెరిగి పెద్దగయి బాగా లావుగా అయింది.

**సింగిల్ పేజి కథ**

ఒకరోజు రైతు లావులావు కాయలన్నీ తెంపుకోని బండిమీద ఏసుకోని పోసాగినాడు. అది చూసి పుచ్చకాయ "అబ్బ! ఈ రైతు ఎంత మంచోడు. రోజూ ఆ ఇసుకలో పొద్దుపోవడం లేదని వూరంతా తిప్పి చూపించడానికి బండి కట్టించినాడు" అనుకోనింది. సంబరంగా రోడ్డు మీద పోయే లారీలు, బస్సులు, సైకిళ్ళు, ఆటోలు...అన్నీ వింతగా చూడసాగింది.

అంతలో బండి ఒకచోట ఆగింది. అక్కడ ఒక పక్క పుచ్చకాయలు గుట్టగా పోసి కనబన్నాయి. ఒక మీసాలోడు పెద్ద కత్తితో ఒకొక్క దాన్ని నడుమకు కోసి, మరలా దాన్ని చిన్న చిన్న వప్పలుగా కోసి, ఎర్రని కండను బయటకు తీసి, దాన్ని మరలా చిన్నచిన్న ముక్కలుగా కోసి, పక్కనే వున్న గాజుడబ్బాలోని ఐసుముక్కల మీద పెడతా వున్నాడు. ఒకడు ఆ ముక్కలని అక్కడ కూచున్న వాళ్ళకు అందించి డబ్బులు తీసుకుంటా వున్నాడు. వాళ్ళు ఒక ముళ్ళ చెంచాతో ఆ ముక్కల నడుమన చెక్కి నోటిలో వేసుకోని కసకసకస నములుతా వున్నారు. అది చూడగానే పుచ్చకాయ ఒళ్ళు జలదరించింది. రైతు మీసాలోని దగ్గర డబ్బులు తీసుకోని పుచ్చకాయలు అక్కడ దించడం చూసింది.

"అమ్మో! ఇన్ని రోజులూ నన్ను పెంచిందీ, పెద్ద చేసిందీ, బాగా చూసుకోనిందీ ఇందుకోసమన్నమాట! ఇంకో నిమిషం గనుక ఇక్కడుంటే నా పని గూడా ఇంతే" అనుకోనింది. నెమ్మదిగా వెనుక పక్క నుండి బండి దిగి ఒక చెట్టు చాటున దాక్కోనింది. ఎవరూ చూడని సమయంలో నెమ్మదిగా అక్కన్నించి తప్పించుకోని పారిపోసాగింది.

దారిలో కొందరు పిల్లలు చూసి "రేయ్! పుచ్చకాయరోయ్... పట్టుకోని తింటే కమ్మగుంటుంది రోయ్" అనుకుంటా దానివెంట పన్నారు. అది చూసి అదిరిపడిన పుచ్చకాయ వాళ్ళకి దొరకకుండా చించుకోని వురకడం మొదలుపెట్టింది. ఈ నగరంలో వుంటే ఈ మనుషులు బతుకనిచ్చేటట్టు లేరని పక్కనే వున్న నల్లమల్ల అడవుల్లోనికి పారిపోయింది.

వురికీ... వురికీ... కాళ్ళు పీకుతా వుంటే అలసిపోయి ఒక చెట్టు కింద కూచోని "హమ్మయ్య! ఇంకేం భయం లేదు" అనుకోనింది. అంతలో వెనుక నుండి ధనధనధనమని భూమి అదిరేలా చప్పుడు వినబడింది. "ఏందబ్బా" అని వెనక్కి తిరిగి చూసింది. ఇంకేముంది...ఒక పెద్ద ఏనుగు తొండం చాపుకోని... లొట్ట లేసుకుంటా... దాన్ని పట్టుకోని తినడానికి దగ్గరికి వచ్చేసింది. అంతే... పుచ్చకాయ అదిరిపడి దానికి దొరకకుండా వురకడం మొదలుపెట్టింది.

అంతలో ఒక ఎలుగుబంటి దాన్ని చూసి "ఏనుగుమామా... దాన్ని నేను పట్టుకుంటా... ఇద్దరమూ సగం సగం పంచుకుందాం... ఏం సరేనా" అని అరిచింది. అది విన్న ఆ పుచ్చకాయ "ఇదేందిరా నాయనా! అక్కడేమో మనుషులు, ఇక్కడేమో జంతువులు... ఏవీ నన్ను బతుకనిచ్చేటట్టు లేవే" అనుకోని పక్కనే వున్న చెట్టుపైకి సరసరసర ఎక్కేసి కొమ్మల మాటున దాచిపెట్టుకోనింది. ఏనుగు, ఎలుగుబంటి కాసేపు వెదికి అది కనబడక పోయేసరికి వెళ్ళిపోయినాయి.

పుచ్చకాయ "హమ్మయ్య! గండం గడిచింది" అనుకోనింది. అంతే... నెత్తిన ఎవరో టప్పున కొట్టిన చప్పుడు వినిపించింది. "ఎవరబ్బా" అని నెత్తి రుద్దుకుంటా పైకి చూసింది. ఇంకేముంది... ఒక గద్ద కొమ్మపై కూచోని టపాటపా కొడతా వుంది. "ఓరిసా... మనుషులూ, జంతువులే అనుకుంటిగానీ, ఆఖరికి పక్షులు గూడా మమ్ములని వదలడం లేదే" అనుకుంటా బెరబెరా చెట్టు దిగి ఒక ముళ్ళ పొదలోనికి దూరి దాచిపెట్టుకోనింది.

చీకటి పడగానే ఎవరికీ కనబడకుండా గుట్టల మాటున, పొదల మాటున దాక్కుంటూ... దాక్కుంటూ...పక్కనే వున్న జగన్నాద గట్టు ఎక్కింది. ఆ కొండ మీద ఒక గుడుంది. ఆ గుడిముందు ఒంటికాలి మీద నిలబడి చేతులు పైకెత్తి దేమునికోసం తపస్సు చేయడం మొదలుపెట్టింది. రోజులు వారాలై, వారాలు నెలలై, నెలలు సమ్మచ్చరాలైనాయి. ఐనా అది తపస్సు కొంచం గూడా ఆపలేదు. అది చూసి దేముడు పైనుండి కిందికి దిగివచ్చి "ఏమే పుచ్చకాయా... ఏంది నీ బాధ... ఎందుకిలా ఒంటికాలిమీద నిలబడి ఇంత ఘోరంగా తపస్సు చేసి నన్ను దిగి వచ్చేలా చేసినావు" అని అడిగినాడు.

అప్పుడా పుచ్చకాయ కళ్ళనిండా నీళ్ళు కారిపోతావుంటే "ఇదేంది స్వామీ! మమ్మల్ని ఈ లోకంలో ఎవరు చూసినా తినడానికి వెంట పడుతూ వున్నారు. ఇలాగయితే ఎలా మేము బతికేది" అంటూ వెక్కి వెక్కి ఏడిచింది. దేముడు దానిని దగ్గరికి తీసుకోని కళ్ళనీళ్ళు తుడిచి "ఓ పుచ్చకాయా... బాధపడకు. అసలు నేను ఈ లోకంలో పళ్ళనే పుట్టించినేదే మనుషుల, జంతువుల, పక్షుల ఆకలి తీర్చడానికి. కాకపోతే ఇప్పటి నుంచీ వాళ్ళు తింటా వున్నా ఎలాంటి బాధా కలగకుండా మీకు ఒక వరమిస్తా. మీరు చెట్టు తొడిమె నుండి వూడిన మరుక్షణమే మీ ప్రాణాలు మీలోని ఏదో ఒక చిన్న విత్తనంలోనికి మారిపోతాయి. ఆ విత్తనం భూమి మీద పడి నీళ్ళు తగలగానే మరలా మీరు మొలకెత్తి కొన్నాళ్ళకి మీ